క్లుప్తంగా

పోస్టర్ల ఆవిష్కరణ

కడప వైఎస్ఆర్ సర్కిల్: కృష్ణ జలాల పునః పంపిణీ అంశంపై కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్ తక్షణం రద్దు చేయాలని కోరుతూ విజయవాడలో ఈ నెల 20, 21న జరిగే 30 గంటల నిరసన దీక్షలను జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో నిరసన దీక్షకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, నగర కార్యదర్శి ఎస్ వెంకట శివ, జిల్లా కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి సమ్మె

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఈనెల 14 నుంచి జిల్లా వ్యాప్తంగా దస్తావేజు లేఖరులు, స్టాంపు వెండర్లు నిర్వహిస్తున్న సమ్మెను జయప్రదం చేయాలని దస్తావేజు లేఖర్ల వృత్తి పరిరక్షణ సమితి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుంటి వేణుగోపాల్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని పాత రిమ్స్‌లో దస్తావేజు లేఖర్ల వృత్తి పరిరక్షణ జిల్లా సమితి సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఈనెల 14వ తేదీ నుండి రాష్ట్ర వ్యాప్తంగా రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖలో ప్రైమ్ 2.0 రిజిస్ట్రేషన్ విధానాన్ని అమలు చేయడం వలన రాష్ట్రంలోని దస్తావేజు లేఖర్లు, వెండర్లు, డీటీపీ ఆపరేటర్లు జీవనోపాధి కోల్పోతారన్నారు. ఈ కార్యక్రమంలో దస్తావేజులేఖర్ల వృత్తి పరిరక్షణ సమితి నాయకులు సంజీవరాయుడు, ఓబులేసు, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

దుస్తులు పంపిణీ

కడప కల్చరల్: స్థానిక ఆశారేఖ ఫౌండేషన్ శనివారం దీపావళి ముందస్తు వేడుకలను ఘనంగా నిర్వహించింది. సంస్థ చైర్ పర్సన్ నెమలి దిన్నె నాగవేణి ఇందిరానగర్ వద్దగల పద్మావతి అనాథలు, వృద్ధుల ఆశ్రమంలో ఈ పండుగను పురస్కరించుకుని అందరికీ నూతన వస్త్రాలు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆశా రేఖ ఫౌండేషన్ సభ్యులు అబ్దుల్, రఘు, రాఘవ, ఆచారి తదితరులు పాల్గొన్నారు.

ఉట్టిపడుతున్న దీపావళి కళ

కడప కల్చరల్ : జిల్లా అంతటా దీపావళి కళ ప్రారంభమైంది. నగరం, పట్టణాలే కాకుండా గ్రామాల్లో కూడా పండుగ కళ కనిపిస్తోంది. ప్రజలు శనివారం మధ్యాహ్నం నుంచి పండుగ నిర్వహణ కోసం అవసరమైన సామాగ్రి కొనుగోలులో తలమునకలయ్యారు. ముఖ్యంగా టపాసుల దుకాణాల వద్ద జనం పెద్ద సంఖ్యలో కొనుగోలు కోసం తరలి వచ్చారు. దాదాపు ప్రతి దుకాణం కొనుగోలుదారులతో కిటకిటలాడింది. ధరలు పెరగడంతో వ్యాపారాలు తగ్గాయని విక్రయదారులు వాపోతున్నారు. కానీ దుకాణాల వద్ద జనం సందడి, కొనుగోలు హడావుడి గమనిస్తే వ్యాపారాలు బాగానే జరిగినట్లు కనిపిస్తోందని ప్రజలు పేర్కొంటున్నారు. ధరలు పెరిగినా సంవత్సరానికి ఒకసారి వచ్చే ఈ పండుగ సందర్భంగా పిల్లల ముచ్చటను కాదనలేక ఖర్చు ఎక్కువైనా టపాసులు కొనక తప్పని పరిస్థితి వచ్చిందన్నారు.

ఇతర సామాగ్రి

టపాసుల తర్వాత పూజా సామాగ్రికి పెద్దడిమాండ్ ఏర్పడింది. కొబ్బరికాయలు, అరిటాకులు కూడా పెద్ద సంఖ్యలో విక్రయించారు. ఈ పండుగకు స్వీట్లు పూజలో ఉంచడం సంప్రదాయం గనుక స్వీట్ల దుకాణాల వద్ద కూడా జనం సందడి కనిపించింది. పూల దుకాణాల వద్ద తీవ్ర రద్దీ కనిపించింది. సాయంత్రం 4.00 నుంచి మార్కెట్లలో పెద్ద ఎత్తున జనసందోహం కనిపించింది. వస్త్రదుకాణాలు, పచారీ దుకాణాలు, మహిళల అలంకార సామాగ్రి దుకాణాలలో జనం అధికంగా కనిపించారు.

అమ్మకాలకు కొద్దిసేపు బ్రేక్

ప్రభుత్వ పురుషుల కళాశాల మైదానంలో శనివారం ఉదయం నుంచే టపాసుల విక్రయాలు ప్రారంభమయ్యాయి. కొద్దిసేపటి తర్వాత వాణిజ్య పన్నులశాఖ అధికారులు ఆకస్మికంగా దుకాణాలను పరిశీలించి జీఎస్టీ చెల్లించకుండానే దుకాణాలు పెట్టుకోవడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో అమ్మకాలు నిలిపి వేశారు. పలు చర్చల అనంతరం పరస్పరం అంగీకారానికి వచ్చి జీఎస్టీ చెల్లించని వారు అప్పటికప్పుడు చెల్లించడంతో తిరిగి వ్యాపారాలు ప్రారంభమయ్యాయి.



కడప నగరంలో శనివారం రాత్రి టపాసుల దుకాణాల వద్ద కొనుగోలుదారుల సందడి

ఆలయాల్లో విశేష పూజలు



విశేష అలంకారంలో శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి

కడప కల్చరల్ : కడప నగరంలోని దేవాలయాల్లో దీపావళిని పురస్కరించుకుని శనివారం దేవతామూర్తులకు విశేష పూజలు నిర్వహించారు. స్థానిక శ్రీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయంలో ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో సభ్యులు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీమాతకు విశేష పూజలు నిర్వహించి శ్రీ లక్ష్మీదేవికి ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని వెండి రథంపై ఆలయ ప్రదక్షిణలు చేయించి భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు అందజేశారు.

– స్థానిక మున్సిపల్ మైదానంలోని శ్రీ రాజ రాజేశ్వరీదేవి ఆలయంలో కాశీ విశ్వేశ్వరస్వామికి పల్లకీ సేవ నిర్వహించారు. స్వామిని నంది వాహనంపై కొలువుదీర్చి ప్రాకారోత్సవం, కర్పూర హారతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు.



విశేష అలంకారంలో శ్రీ వాసవీ కన్యకాంబ

15న ఏపీటీఎఫ్ ధర్నా

కడప ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక సమస్యలను వెంటనే పరిష్కరించాలంటూ ఈనెల 15వ తేదీన విజయవాడలో నిర్వహించే ధర్నా కార్యక్రమం విజయవంతం చేయా లని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం కడప ఏపీటీఎఫ్ కార్యాలయంలో ధర్నాకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ ఖాదర్‌బాష, గురవయ్య, జిల్లా కార్యదర్శులు, జిల్లా కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కరువు నివారణ చర్యలు చేపట్టాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: రాయలసీమలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కరువు నివారణ చర్యలు చేపట్టాలని ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం నగరంలోని ఆర్‌సీపీ కార్యాలయంలో రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతంలో ఆర్‌సీపీ ఆధ్వర్యంలో కరువు యాత్రలు నిర్వహిస్తున్నామన్నారు. కడప అనంతపురం, కర్నూలు జిల్లాలలో కరువు మండలాలను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌సీపీ నాయకులు లింగమూర్తి, నాగన్న, అక్బర్, సిద్ధరామయ్య తదితరులు పాల్గొన్నారు

ప్రాథమిక దశలోనే పరీక్షలు చేయించుకోవాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రాథమిక దశలోనే దీర్ఘకాలిక వ్యాధులకు సంబంధించి పరీక్షలు చేయించుకోవాలని ఆరోగ్య వైద్యాధికారి ప్రసన్నలత, అర్బన్ హెల్త్ ట్రైనింగ్ వైద్యులు హర్షవర్ధన్ తెలిపారు. శనివారం నగరంలోని రాజారెడ్డివీధి, మారుతినగర్ తదితర ప్రాంతాల్లో ఎంబీబీఎస్ విద్యార్థులతో ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంబీబీఎస్ విద్యార్థులతోపాటు వైద్యులు జ్యోతిష్, కారుణ్య, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

మోదీతోనే దేశాభివృద్ధి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రధానమంత్రి నరేంద్రమోదీతోనే దేశం అభివృద్ధి చెందుతుందని భారతీయ జనతా యువమోర్చా జిల్లా అధ్యక్షులు బొమ్మన విజయ్ తెలిపారు. శనివారం పార్టీ కార్యాలయంలో భారతీయ జనతా యువమోర్చా నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గాల వారీగా భారతీయ జనతా పార్టీ పథకాలపై ప్రచారం చేయనున్నామన్నారు.

రంగుల లోకంలో చిన్నారుల సందడి

– బాలోత్సవం విజయవంతం

కడప కల్చరల్ / కడప ఎడ్యుకేషన్: కడప నగరంలోని శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు చిన్నారుల సందడితో కనువిందు చేసింది. ఎల్‌కేజీ నుంచి పీజీ వరకు విద్యార్థులు బుద్ధిగా అట్టలు, రంగులతో వచ్చి తమకు వచ్చిన బొమ్మలు గీసి రంగులు నింపి పోటీలో పాల్గొన్నారు. జన విజ్ఞాన వేదిక బాలోత్సవ్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి దాదాపు 900 మంది చిన్నారులు హాజరయ్యారు. మూడు విభాగాలుగా నిర్వహించిన ఈ పోటీకి చిన్నారులు భారీగా తరలి రావడంతో నిర్వాహకుల్లో ఆనందం నెలకొంది. కన్వీనింగ్ కమిటీ సభ్యులు బి.లక్ష్మిరాజా, బి.రాజశేఖర్ రాహుల్, కళాశాల నిర్వాహకుల ద్వారా చిన్నారుల పోటీలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశారు. దాదాపు మూడు గంటలపాటు కళాశాల ప్రాంగణమంతా బొమ్మలు గీసేందుకు వచ్చిన చిన్నారులతో కళకళలాడింది.

సృజనను పెంచేందుకు..

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీయటానికి జిల్లాలో బాలోత్సవం సంస్థ శాఖను ఏర్పాటు చేశామని లక్ష్మిరాజా, రాజశేఖర్ రాహుల్ తెలిపారు. ఈ చిత్రలేఖనం పోటీలలో పలు ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల నుండి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు. ప్రతి విభాగంలోనూ ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతోపాటు ప్రోత్సాహక బహుమతులు కూడా ఉంటాయని వివరించారు. ఈ నెల 14న బాలల దినోత్సవ సందర్భంగా ఇదే కళాశాలలో బహుమతులు ప్రదానం చేస్తామని, విజేతలకు ఫోన్ ద్వారా సమాచారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో బాలోత్సవ కన్వీనింగ్ కమిటీ ప్రతినిధి ఎస్ఎస్ఏ పీఓ అంబవరం ప్రభాకర్ రెడ్డి, ప్రిన్సిపాల్ వీర సుధాకర్‌రెడ్డి, బి.గోపాల్. నాగ మునిరెడ్డి, బాల ఎల్లారెడ్డి, కోటా మృత్యుంజయరావు, దేవదత్తం, వెంకటేశ్వర్లు, సురేష్ బాబు, రఘునాథరెడ్డి, కరీం, సునీత తదితరులు పాల్గొన్నారు.



చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

మ్యాథ్ 'బి'కి విశేష స్పందన



కడప నగరంలోని జీఎంఆర్ హైస్కూల్‌లో మ్యాథ్ 'బి' కాంపిటీషన్‌లో పాల్గొన్న విద్యార్థులు

వైవీయూ : సాక్షి మీడియా గ్రూపు ఆధ్వర్యంలో నిర్వహించిన మ్యాథ్ 'బి' కాంపిటీషన్‌కు విద్యార్థుల నుంచి చక్కటి స్పందన లభించింది. ఈ కాంపిటీషన్‌లో పాల్గొన్న పలువురు విద్యార్థులు మాట్లాడుతూ.. గణితం పట్ల ఉన్న భయాన్ని పోగొట్టారని.. తమలో గణితం పట్ల ఆసక్తి పెంచేలా.. చిన్నచిన్న సమస్యలు మొదలు.. స్థాయిని అనుసరించి నిర్వహించిన కాంపిటీషన్ ఎంతో బాగుందని పేర్కొన్నారు.

విద్యాభివృద్ధికి బాటలు వేసిన తొలి బాటసారి



వైవీయూ: మాట్లాడుతున్న ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రమేష్



కడప ఎడ్యుకేషన్: కలెక్టర్ నుంచి అభినందన పత్రాన్ని అందుకుంటున్న షేక్ షబ్బీర్

కడప ఎడ్యుకేషన్: భారతదేశ విద్యాభివృద్ధికి బాటలు వేసిన తొలి బాటసారి స్వాతంత్ర సమరయోధుడు అబుల్ కలాం అజాద్ అని ఆల్ మేవా రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎస్ఏ ఫరూక్ అన్నారు. శనివారం కడప రవీంద్రనగర్‌లోని ఉర్దూ లైబ్రరీ సెంటర్‌లో ఆల్‌మేవా జిల్లా అధ్యక్షులు పీఎం జలీల్‌ఖాన్, కార్యదర్శి నజీర్‌బాషల ఆధ్వర్యంలో అబుల్‌కలాం జయంతిని, మైనార్టీ డేని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అబుల్‌కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. మైనార్టీ సంక్షేమ అధికారి ఖాదర్‌బాష మాట్లాడారు. కార్యక్రమంలో ఆల్‌మేవా గౌరవ అధ్యక్షులు గౌస్‌పీర్, జిల్లా ఆర్థిక కార్యదర్శి మైనుద్దీన్, రాష్ట్ర నాయకులు ఇలియాస్‌బాష, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

– మౌలానా అబుల్ కలాం ఆజాద్ బహుముఖ ప్రజ్ఞాశాలి అని, ఆయన నేటి యువతకు ఆదర్శం అని ఎస్టీయూ జిల్లా మైనార్టీ కన్వీనర్, వక్కలపేట ఎంపీపీఎస్ ఉర్దూ ప్రాథమిక పాఠశాల హెడ్ టీచర్ నజీబుల్లా అన్నారు. అబుల్‌కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని శనివారం వక్కలపేట నగరపాలక ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో జాతీయ విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్కూల్ కమిటీ చైర్మన్ సల్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సేవకు అభినందన

కడప కలెక్టరేట్ కార్యాలయ స్పందన హాలులో శనివారం భారతరత్న మౌలానా అబుల్‌కలాం ఆజాద్ జయంతి ఉత్సవాలు, జాతీయ విద్య దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయరామరాజు పలువురికి అభినందన పత్రాలు అందజేశారు. మౌలానా ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు షేక్ షబ్బీర్‌కు ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఆయన చేస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు.

ఆజాద్ చేసిన సేవలు మరువలేనివి

వైవీయూ: ఉన్నత విద్యారంగంలో భారత తొలి విద్యాశాఖామంత్రిగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ తీసుకు వచ్చిన సంస్కరణలు, సేవలు మరువలేనివని కడప ప్రభుత్వ పురుషుల కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా. ఎం. రమేష్ పేర్కొన్నారు. శనివారం ఆర్ట్స్ కళాశాలలో మౌలానా జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డా. అంకాల్ నాగరాజు, పి. శివరామృష్ణ, ఉర్దూ అధ్యాపకులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధులను గుర్తుంచుకోవాలి

– నగరపాలక మేయర్ సురేష్‌బాబు

కడప ఎడ్యుకేషన్: స్వాతంత్ర సమరయోధులను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని నగర మేయర్ సురేష్ బాబు అన్నారు. శనివారం కడపలోని అప్సర హాల్ వద్ద జేకే జనం కోసం యూత్ వెల్ఫేర్ సొసైటీ, సంఘ సేవకులు సికిందర్ హుస్సేన్ సంయుక్త ఆధ్వర్యంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని స్వాతంత్ర సమరయోధుల చిత్రాలను ముద్రించిన స్టికర్స్ మేయర్ సురేష్‌బాబు చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాంతంత్రం కోసం పోరాడిన మహానుభావుల్లో అబుల్‌కలాం ఆజాద్ ఒకరన్నారు. ఆయన తొలి విద్యాశాఖ మంత్రిగా దేశానికి ఎంతో సేవ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అహ్మద్‌బాష, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు సుబ్బారెడ్డి, షా సోషల్ జస్టిస్ ఫర్ ఇంటర్నేషనల్ సివిల్ అండ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ నగర అధ్యక్షుడు పటాన్ ఖాదర్‌బాష తదితరులు పాల్గొన్నారు.



స్టిక్కర్స్‌ను విడుదల చేస్తున్న మేయర్ సురేష్‌బాబు